

5న చంద్రబాబు రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రా...కదలిరా' పేరుతో ఈనెల ఐదో తేదీన అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరగనున్న సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఐదో తేదీ ఉదయం విశాఖ చేరుకుని ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో గొండుపాలెం వెళతారు. అక్కడ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఏలూరు జిల్లా చింతలపూడి వెళతారు.

డోలీ మోతలు ఇంకెన్నాళ్లు?

ఏజెన్సీలో రోడ్డు, రవాణా సదుపాయాలు లేక ఇక్కట్లు

- మొత్తం 3,803 గ్రామాలకు గాను ఇప్పటికీ రోడ్డు లేనివి 1,648
- మారుమూల ప్రాంతాలకు కాలినడకనే గిరిజనుల ప్రయాణం
- డోలీ మోతలపై రాష్ట్ర హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఏజెన్సీలోని చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ఎంత దూరమైనా గిరిజనులు కాలినడకన వెళ్లాల్సిందే. మారుమూల ప్రాంతాల్లోని రోగులు, గర్భిణులను ఆస్పత్రులకు తీసుకువెళ్లాలంటే డోలీ మోతలు తప్పడం లేదు. ఈ క్రమంలో సకాలంలో వైద్య సేవలు అందక మృత్యువాత పడిన వారు ఎందరో ఉన్నారు. కానీ పాలకులు, అధికారుల్లో చలనం లేదు. రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుందామన్న ధ్యాసే లేదు. దీంతో గిరిజనులు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు.



పెదయలు మండలం ఇంజెరి పంచాయతీ మూలలోవలో గర్భిణిని డోలీలో మోసుకెళుతున్న గిరిజనులు (ఫైల్)

రహదారి సౌకర్యం లేక ఏజెన్సీలోని పలు గిరిజన గ్రామాల ప్రజలు రోగులు, గర్భిణులను అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి తరలించడానికి డోలీలను వినియోగిస్తున్నారు. కిలో మీటర్ల మేర డోలీతో నడవాల్సిన దుస్థితి ఉంది. ఈ క్రమంలో గిరిజనులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడడం సర్వసాధారణమైంది. ఈ సమస్యపై హైకోర్టు న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన రాష్ట్ర హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కీలక వ్యాఖ్యలు చేసింది. నేటి సమాజంలో డోలీ మోతలు చూస్తుంటే ఆదిమ సమాజం గుర్తొస్తుందంటూ ఘాటుగా పేర్కొనడంతో పాటు గిరిజన ప్రాంతంలో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో రోడ్డు నిర్మిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని హైకోర్టు సూచించింది. డోలీ మోత సమస్య, రోడ్ల నిర్మాణాలపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావులతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తాజాగా హైకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలతో గిరిజన ప్రాంతాల్లోని 'డోలీ మోతలు- గిరిజనుల వెతలు' మరో మారు చర్చనీయాంశమైంది.



జి.మాడుగుల మండలం మారుమూల గడుతూరు పంచాయతీలో రోగిని డోలీలో మోస్తున్న దృశ్యం (ఫైల్)

ఏజెన్సీలో 1,648 గ్రామాలకు రోడ్డు లేదు

ఏజెన్సీ 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,803 గిరిజన గ్రామాలుండగా, వాటిలో 2,155 గ్రామాలకు మాత్రమే రోడ్డు సదుపాయం ఉంది. మిలిగిన 1,648 గ్రామాలకు ఎటువంటి రోడ్డు సదుపాయం లేదు. పైగా వాటిలో 972 గ్రామాలు అత్యంత మారుమూల ప్రాంతాల్లో వున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని గిరిజనులు కొండలు కోనలు, వాగులు వంకలు దాటుకుంటూ బాహ్య ప్రపంచానికి చేరుకుంటున్నారు. మామూలుగా అయితే కాలినడకన గిరిజనులు ఎంత దూరమైన రాకపోకలు సాగిస్తారు. కానీ అనారోగ్య సమస్యలు, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రోగులను, గర్భిణులను డోలీల్లో కొండ కోనల్లోంచి పదుల కిలోమీటర్లు మోసుకుని వచ్చి రోడ్డున్న ప్రాంతాలకు చేరుకుని, అక్కడి నుంచి అంబులెన్సుల్లో ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. ఈ ప్రయాణంలో రోగులు, గర్భిణుల పరిస్థితులు విషమిస్తే అంతే సంగతులు. దేవుడిపై భారం వేసి కొండ కోనల్లోంచి రోడ్డు ప్రాంతాలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. అందువల్లే ఏజెన్సీలో నిత్యం ఏదో ప్రాంతంలో రోగి లేదా గర్భిణిని డోలీల్లో మోసుకువస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఏజెన్సీలో ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, జీకేవీధి, కొయ్యూరు, పాడేరు, హుకుంపేట మండలాల్లోనే అధికంగా రోడ్లు లేని మారుమూల గిరిజన గ్రామాలున్నాయి.


రోడ్ల నిర్మాణంపై పాలకులకు చిత్తశుద్ధి కరవు

మన్యంలో రోడ్ల నిర్మాణంపై పాలకులకు చిత్తశుద్ధి లేని కారణంగానే ఇప్పటికీ గిరిజనులకు కాలినడక ప్రయాణాలు తప్పడం లేదు. ఏజెన్సీ మారుమూల ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో పక్కా తారురోడ్లను మంజూరు చేస్తున్నది. ఫలితంగానే ఏజెన్సీలో కొంత వరకైనా మారుమూల ప్రాంతాల వాసులకు రహదారుల సదుపాయం వుంది. కాగా రోడ్లపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం దృష్టి సారించకపోవడంతో గిరిజనుల రోడ్డు, రవాణా వెతలు ... మిగతా 8వ పేజీలో



సమరమే..

నేటి నుంచి విశాఖలో భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్



రోహిత్ శర్మ



బెన్ స్టోక్స్

వేదికగా ఏసీఏ వీడీసీఏ స్టేడియం

- తొలి టెస్టులో గెలుపుతో ఉత్సాహంగా బరిలోకి ఇంగ్లండ్
- కలిసొచ్చిన పిచ్‌పై టీమిండియా విజయంపై అభిమానుల ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 1:

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న రెండో టెస్ట్‌కు భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు సిద్ధమయ్యారు. మ్యాచ్ కోసం మంగళవారం నగరానికి చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లు బుధ, గురువారాల్లో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఓటమితో సిరీస్‌లో వెనుకబడిన టీమిండియా విశాఖ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు తొలి టెస్టులో విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ జట్టు సిరీస్‌లో ఆధిక్యాన్ని కొనసాగించాలనే ధ్యేయంతో ఉంది. దీంతో మ్యాచ్ రసవత్తరంగా జరిగే అవకాశం ఉంది.

కలిసొచ్చిన పిచ్‌పై ఆశలు

ఇక్కడి పిచ్ భారత్‌కు కలిసొస్తుందని అభిప్రాయాలున్నాయి. ఈ పిచ్‌పై జరిగిన (వన్డే, టీ20, టెస్టు వంటి అన్ని ఫార్మట్లు) మ్యాచ్‌లలో భారత్ తొంభై శాతం విజయాలు సాధించింది. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌లలో భారత్ జట్టు భారీ తేడాతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే టెస్టులో కూడా గెలుపు ఖాయమని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే ఈ పిచ్‌పై దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలతో కదంతొక్కిన రోహిత్‌శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ జట్టుకు దూరం కావడంతో యువ ఆటగాళ్లు శుభమన్ గిల్, శ్రేయాస్ అయ్యార్, జైస్వాల్‌పై ... మిగతా 7వ పేజీలో

ప్రధాన ఆకర్షణగా లోకల్ బాయ్ భరత్



భరత్‌ను సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

లోకల్ బాయ్ కోన శ్రీకర్ భరత్ ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. వికెట్ కీపర్ అయిన భరత్...హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో నాలుగు క్యాచ్‌లు పట్టడంతోపాటు బ్యాటింగ్‌లోనూ (తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులు) రాణించాడు.

మన్యంలో 13 మంది తహసీల్దార్లకు పోస్టింగ్

- ఇద్దరు కలెక్టరేట్‌కు, ఒకరు సబ్‌కలెక్టర్ కార్యాలయం, పది మందికి మండలాలు కేటాయింపు

పాడేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కొత్తగా 13 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జి.మాడుగుల తహసీల్దార్‌గా పని చేస్తున్న వీవీ గోపాల కృష్ణను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన ఎస్.హైమావతిని డుంబ్రిగుడ, ఎం.సావిత్రిని కలెక్టరేట్‌కు, పి.సోమేశ్వరరావును అరకులోయ, ఎన్.అప్పారావు జి.మాడుగుల, ఎస్.నర్సింహమూర్తి అనంతగిరి, టి.కల్యాణచక్రవరికి సబ్ కలెక్టర్ కార్యాలయం, బి.రాజమోహనరావును పెదబయలు తహసీల్దార్‌గా నియమించారు. అలాగే విజయనగరం జిల్లా నుంచి వచ్చిన అజు రఫీజన్ ముంచంగిపుట్టు, డి.రాజేశ్వరరావు కొయ్యూరు, బి.రత్నకుమారి జీకేవీధి, ఎం.అరుణకుమారి పాడేరు తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన సీహెచ్.రాధాకృష్ణమూర్తికి చింతపల్లి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. వీరంతా నేడో రేపో విధుల్లో చేరే అవకాశముంది.

ఎంఈవో- 2 జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ఎంఈవో- 2 నూతన కార్యవర్గం

పాడేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారులు- 2 సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షురాలిగా జి.పుష్పావతి(పెదబయలు), ప్రధాన కార్యదర్శిగా కె.ఈశ్వరరావు(హుకుంపేట), కోశాధికారిగా సీహెచ్.సరస్వతి(పాడేరు), అసోసియేట్ అధ్యక్షుడిగా జి.బోడంనాయుడు(చింతపల్లి), అదనపు కార్యదర్శిగా భారతీదేవి(అరకులోయ), ఉపాధ్యక్షులుగా పి.మల్లేశ్వరరావు(గంగవరం), లక్ష్మీనారాయణ(చింతూరు), మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గిరిజన విద్యాభివృద్ధికి, ఎంఈవోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ఈ సందర్భంగా పేర్కొంది.

జీసీసీ సోప్ యూనిట్ తెరుచుకునేదెన్నడో?

2022 నవంబరు నుంచి మూసివేత

- సిబ్బందిని వివిధ విభాగాల్లోకి సర్దుబాటు
- యూనిట్‌ను తెరుస్తామని ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రకటనలు
- ఇంత వరకు చర్యలు శూన్యం
- గిరిజన శాఖా మంత్రి విఫలమయ్యారని ప్రజా సంఘాల ఆరోపణలు

అరకులోయ, ఫిబ్రవరి 1:

అరకులోయలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే సోప్ యూనిట్ శాశ్వతంగా మూతపడే పరిస్థితి కనిపిస్తోంది. 2022 నవంబరు నుంచి సోప్ యూనిట్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదు. అప్పటికే లక్ష సబ్బుల స్టాకుతో మూతపడింది. యూనిట్‌ను తెరుస్తామని ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రకటనలు తప్ప ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



అరకులోయలో మూసి ఉన్న సోప్ యూనిట్

గిరిజన సహకార సంస్థ(జీసీసీ) 2008వ సంవత్సరంలో అరకులోయలో సోప్ యూనిట్‌ను (సబ్బుల తయారీ కేంద్రం) ఏర్పాటు చేసింది. నెలకు లక్ష సబ్బులు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇక్కడ తయారు చేసిన సబ్బులను రాష్ట్రంలో (ఉమ్మడి ఏపీ) ఉన్న అన్ని గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలకు సరఫరా చేసేవారు. డ్వామా అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల కోసం సబ్బులు కొనుగోలు చేసేవారు. ఇంకా జీసీసీ డీఆర్ డిపోలకు కూడా సబ్బులు సరఫరా అయ్యేవి. దీంతో 2012లో సోప్ యూనిట్‌ను విస్తరించి నెలవారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండు లక్షల సబ్బులకు, 2020లో మూడు లక్షల సబ్బుల తయారీకి పెంచారు. నీమ్ (వేప), అలోవేరా (కలబంద), టర్మరిక్ (పసుపు), జాస్మిన్ (మల్లె) రకం సబ్బులు తయారు చేసేవారు. కాగా 2020 మార్చిలో కొవిడ్-19 ప్రబలడంతో గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలను నెలల తరబడి మూసివేశారు. అదే ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించింది. నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో గిరిజన సంక్షేమ శాఖకు చెల్లించే కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం నిలిపివేసింది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సోప్ యూనిట్ నుంచి సబ్బుల కొనుగోళ్లను ఆపేశారు. ఈ ప్రభావం సోప్ యూనిట్‌పై పడడంతో ఉత్పత్తిని బాగా తగ్గించేశారు. ఇదే సమయంలో డ్వామా నుంచి కూడా కొనుగోళ్లు ఆగిపోయాయి.

తెరుస్తామని ప్రకటనలే తప్ప ఆచరణ శూన్యం

2022 నవంబరులో సోప్ యూనిట్‌ను మూసివేసే నాటికి లక్ష సబ్బులు నిల్వ ఉన్నాయి. గత ఏడాది ఈ యూనిట్‌ను జీసీసీ మార్కెటింగ్ జీఎం సందర్శించి ఈ భవనానికి మరమ్మతులు చేపడతామని, వినియోగదారులను ఆకట్టుకునే విధంగా సబ్బుల ఆకారం, ప్యాకింగ్ మార్పు చేస్తామని సిబ్బందికి హామీ ఇచ్చారు. గత ఏడాది ఆగస్టులోనే యూనిట్‌ను పునఃప్రారంభిస్తామని చెప్పారు. అయితే ఇంత వరకు ఎటువంటి కదలిక లేదు. ఇక్కడ పని లేకపోవడంతో ఇన్‌చార్జి కోటేశ్వరరావును అరకులోయ డీఆర్ డిపో గొడౌన్ ఇన్‌చార్జిగా నియమించారు. 23 మంది కార్మికులు ఉండగా వారిలో నలుగురిని డీఆర్ డిపోనకు, ఇద్దర్ని జీసీసీ సూపర్‌బజార్‌కు, మిగిలిన వారిని కార్యాలయం, గొడౌన్‌లో సర్దుబాటు చేశారు. వీరందరికి ప్రస్తుతం జీసీసీయే జీతాలు చెల్లిస్తుంది.

యూనిట్ పునరుద్ధరణలో మంత్రి విఫలం!

సోప్ యూనిట్‌ను పునరుద్ధరించడంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌తో రాజన్నదొర మాట్లాడి విద్యార్థుల కాస్మొటిక్ చార్జీలను అమ్మఒడి నుంచి మినహాయించి జీసీసీకి అందజేస్తే సోప్ యూనిట్ తెరుచుకునేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులతో పాటు కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న చలి తీవ్రత

జి.మాడుగుల, జీకేవీధి, అరకులోయలో 8.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు

పాడేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత, పొగమంచు తగ్గడం లేదు. అలాగే కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. గురువారం జి.మాడుగుల, జీకేవీధి, అరకులోయలో 8.7, పాడేరులో 10.9, ముంచంగిపుట్టులో 11.5, పెదబయలులో 11.7, అనంతగిరిలో 12.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. సుమారుగా గత పది రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం వేళల్లో పొగ మంచు దట్టంగానే కమ్ముకుంటున్నది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక మోస్తరుగా ఎండ ప్రభావం ఉండగా, మిగిలిన సమయాల్లో చలి ప్రభావం కొనసాగుతున్నది.



పాడేరు- జి.మాడుగుల మార్గంలో గురువారం ఉదయం పొగమంచు



చింతపల్లిలో మంచు

దీంతో చలి మంటలు వేసుకుని, ఉన్ని దుస్తులు ధరించి మన్యం వాసులు చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో మంచు తీవ్రత అధికంగా ఉంది. గురువారం చింతపల్లిలో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చలితో పాటు మంచు గిరిజన ప్రాంతంలో అధికంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు లంబసింగి, చింతపల్లి, తాజంగి, ఆర్‌వీనగర్, జీకేవీధిలో మంచు వీడడం లేదు.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు ప్రారంభించిన యూటీఎఫ్ నేతలు

యూటీఎఫ్ నేతల రిలే నిరాహార దీక్షలు

ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్

పాడేరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు టీఏలు, డీఏలు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ తదితర రూపాల్లో వున్న ఆర్థిక బకాయిల చెల్లింపులు చేపట్టాలనే డిమాండ్‌పై గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వివిధ రూపాల్లో ఉద్యోగులకు రూ.వేల కోట్లు బకాయిపడిందని, వాటిని తక్షణమే చెల్లించాలన్నారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి నాగేశ్వరరావు, నేతలు ఎస్.కన్నయ్య, వీవీ ఈశ్వరరావు, బి.సింహాచలం, టి.విజయకుమార్, దేముడు, ఎస్.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ ముమ్మర సాధన

ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా శుక్రవారం ప్రారంభం కానున్న రెండో టెస్ట్‌మ్యాచ్‌కు భారత్-ఇంగ్లాండ్ క్రికెటర్లు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. రెండోరోజు గురువారం ఇరు జట్ల క్రీడాకారులు ముమ్మర సాధన చేశారు. ఉదయం నుంచీ ముమ్మరంగా బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. ఆటవిడుపుగా కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశారు. మొదటిమ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించడంతో అచ్చొచ్చిన పిచ్‌పై భారత్ ఆటగాళ్లు తమ సత్తా చూపుతారని అభిమానులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మ్యాచ్ వీక్షణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బి గ్రౌండ్‌లో శుభంగిల్ బ్యాటింగ్ ప్రాక్టీసు



ఇంగ్లండ్ ఆటగాళ్ల ప్రాక్టీసు


ప్రాక్టీసుకు సిద్ధమవుతున్న సర్ఫరాజ్‌ఖాన్


స్వీప్‌షాట్ ప్రాక్టీసు చేస్తున్న భారత ఆటగాడు

క్రైం... crime news

బాలికను అపహరించుకుపోయిన యువకుడి అరెస్టు, పోక్సో కేసు

హుకుంపేట, ఫిబ్రవరి 1: ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, ఆమెను అపహరించుకుపోయిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ బి.సతీశ్ గురువారం మీడియాకు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలిక అరకులోయలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం చీడిపల్లి గ్రామానికి చెందిన కింతాడ సంతోశ్ అనే యువకుడితో కొద్దికాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్ ద్వారా మాట్లాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 22వ తేదీన సంతోశ్, ఆ బాలికకు ఫోన్ చేసి చోడవరం రమ్మని చెప్పాడు. దీంతో ఆమె చోడవరం వెళ్లగా, అక్కడి నుంచి తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. కళాశాలకు వెళ్లిన కుమార్తె సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాల్లో వున్న బంధువులను, ఆమె స్నేహితులను వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో మరోసారి పోలీసులను కలిశారు. బాలిక వద్ద వున్న ఫోన్ టవర్ పరిధిని గత నెల 28వ తేదీన ట్రేస్ చేసిన పోలీసులు ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతంలో వున్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. బాపట్ల పోలీసులు మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా బాలిక ఎక్కడ వుందో గుర్తించి వెంటనే అక్కడకు వెళ్లారు. అయితే సంతోశ్ అక్కడి నుంచి పారిపోగా, బాలికను అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న హుకుంపేట పోలీసులు బాపట్ల వెళ్లి బాలికను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా జనవరి 31వ తేదీన సంతోశ్ పాడేరులో సంచరిస్తుండగా హుకుంపేట పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు కిడ్నాప్, చీటింగ్ కేసులు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 1 : మండలంలోని గబ్బాడ సమీపంలో నెల్లిమెట్ట జంక్షన్ వద్ద 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. నెల్లిమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారులో 46 కిలోల గంజాయి బయటపడిందన్నారు. గొలుగొండ మండలం కంఠారం గ్రామానికి చెందిన నడిపింటి భాస్కరరావు, చింతపల్లి మండలం రాళ్లగెడ్డ గ్రామానికి చెందిన వంతల రాములు పరారయ్యారని, కారును సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వృద్ధురాలిని మోసగించిన ఇద్దరు వలంటీర్లతోసహా నలుగురిపై కేసు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 1: కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వృద్ధురాలి వేలి ముద్రలు తీసుకుని, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు తస్కరించినట్టు అందిన ఫిర్యాదుపై ఇద్దరు వలంటీర్లు, వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అట్టాడ విభీషణరావు తెలిపారు. మండలంలోని జేవీపాలెం గ్రామానికి చెందిన వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్.. కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో గత నెల 21వ తేదీన ఎద్దు లక్ష్మి అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లారు. వివరాలు సేకరించిన తరువాత ఆమె వేలి ముద్రలు తీసుకున్నారు. అయితే తన బ్యాంకు ఖాతాలో నుంచి రూ.10 వేలు వేరే వ్యక్తులు డ్రా చేసినట్టు ఆలస్యంగా తెలుసుకున్న వృద్ధురాలు.. గ్రామ టీడీపీ నాయకుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. జేవీపాలెం గ్రామ వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్, సైతారుపేటకు చెందిన వీసం రామసోమనాయుడు, వేమగిరికి చెందిన వై.రవి కలిసి వృద్ధురాలి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు తస్కరించినట్టు గుర్తించారు. దీంతో గురువారం కేసు నమోదు చేశారు. కాగా వలంటీర్ల మోసంపై ఈవోపీఆర్‌డీ సత్యనారాయణను వివరణ కోరగా, జేవీ పాలెం గ్రామ వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్‌పై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామని చెప్పారు. ఆయన నుంచి రిపోర్టు అందించిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువులు, జీవాలతో అదనపు ఆదాయం

» అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ నర్సింహులు

రావికమతం, ఫిబ్రవరి 1: పాడి పశువులు, జీవాల పోషణలో రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించేలా పశువైద్యులు, గోపాల మిత్రలు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెకర్ సీహెచ్.నర్సింహులు సూచించారు. పశువైద్యాధికారులు, గోపాల మిత్రలతో గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయం తరువాత పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఆదాయాన్ని ఇస్తుంటాయని, అందువల్ల వీటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన ఆదాయం పొందగలుగుతారని చెప్పారు. ఈ సమావేశంలో రావికమతం ఏడీ టి.పుష్ప, తట్టబంద, కొత్తకోట పశువైద్యాధికారులు జి.నూకేశ్వరరావు, బాల తేజ పాల్గొన్నారు.

తాగునీటి పథకం పైపులు దగ్ధం

నర్సీపట్నం, ఫిబ్రవరి 1: పెదబొడ్డేపల్లిలో సమగ్ర తాగునీటి పథకానికి సంబంధించిన ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నిల్వ చేసిన ఈ పైపుల నుంచి గురువారం సాయంత్రం మంటలు లేచాయి. దట్టమైన పొగలు కమ్మేయడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇక్కడ పేరుకు పోయిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల మంటలు ఎగిసి ప్లాస్టిక్ పైపులకు వ్యాపించి ఉంటాయని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మొత్తం 43 పైపులు దగ్ధం కావడంతో రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

'డీఎస్సీ పోస్టులు పెంచాలి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: ప్రభుత్వం డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడం హర్షణీయమని, అయితే 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిల్లో నాలుగో వంతు పోస్టులు మాత్రమే భర్తీ చేయడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు అల్లు రాజు, పాంగి చలపతి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చంద్రబాబు సభకు భారీగా జనసమీకరణ

» నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

కె.కోటపాడు, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన మండలంలోని గొండుపాలెంలో 'రా కదలి రా!' నినాదంతో నిర్వహించే బహిరంగకు హాజరై ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. గురువారం కూండ్రవానిపాలెంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు తరలి వచ్చేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో వున్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండు లక్షలకుపైగా జన సమీకరణ చేయాలన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకర్గాల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించడానికి ఈ బహిరంగ సభ నాంది పలకాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, కేఎస్ఎన్ఎస్ రాజు, గండి బాబ్జీ, గవిరెడ్డి రామానాయుడు, నియోజకర్గాల ఇన్‌చార్జిలు పీవీజీ కుమార్ (మాడుగుల), ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), బత్తుల తాతయ్యబాబు (చోడవరం), సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, దాడి రత్నాకర్, గూనూరు మల్లునాయుడు, జనసేన చోడవరం ఇన్‌చార్జి పీఎస్ఎన్ రాజు, రాయపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట దళితుల ధర్నా

» దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేయలేదని ఆరోపణ


పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించిన ఆందోళనకారులు

మాడుగుల, ఫిబ్రవరి 1: తన పొలంలో చెట్లను నరికివేయడమే కాకుండా, తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు కేసు నమోదు చేయలేదంటూ మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన దళితుడు యర్రంశెట్టి శ్రీను, మాలమహానాడు (పీవీ రావు) నాయకులు గురువారం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి శ్రీను మీడియాకు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనుకు 1993లో సర్వే నంబరు 134/7లో రెండు ఎకరాల 12 సెంట్ల భూమికి రెవెన్యూ అధికారులు డి.పట్టా అందజేశారు. ఇందులో మామిడి, చింత, ఇతర చెట్లను నాటుకుని ఫలసాయం పొందుతున్నాడు. కాగా ఇటీవల సమగ్ర రీసర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు... ఇదే సర్వే నంబరులో మారాజు అప్పారావు అనే వ్యక్తికి 70 సెంట్లకు సంబంధించి డి.పట్టా మంజూరు చేశారు. ఈ విషయం శ్రీనుకు తెలియదు. కాగా రెవెన్యూ అధికారులు తనకు పంపిణీ చేసిన భూమిలో వున్న మామిడి, చింత చెట్లను రెండు రోజుల క్రితం అప్పారావు నరికివేస్తుండగా.. తన భూమిలో చెట్లు ఎందుకు నరుకుతున్నావని శ్రీను ప్రశ్నించాడు. దీంతో అప్పారావు, మరి కొంతమంది కలసి శ్రీనుపై దాడికి పాల్పడ్డారు. అనంతరం శ్రీను పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రెండు రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో గురువారం ఆందోళనకు దిగారు. దీనిపై ఎస్ఐ దామోదరనాయుడుని వివరణ కోరగా.. ఇరువర్గాల చేసిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు (పీవీ రావు) జిల్లా అధ్యక్షుడు వేచలపు సహదేముడు, ప్రధాన కార్యదర్శి రెల్లి తాతారావు, నాయకులు కె.వెంకటరమణ, గాలి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగింపు


షెడ్‌లను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, అక్రమంగా నిర్మించిన ఇళ్లను అధికారులు గురువారం కూల్చివేత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులకు, ప్రభుత్వ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది.

మండలంలోని మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, తారకరామకాలనీలోని సర్వే నంబరు 353, 354/1, 357లలో స్థలాలను ఆక్రమించి సుమారు 100 షెడ్‌లను నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్వో నాగరాజు.. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టవద్దని ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. అయితే స్థానిక వైసీపీ నాయకుల అండదండలు ఉండడంతో వీఆర్వో ఆదేశాలు బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై పత్రికల్లో కథనాలు రావడం, రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు తగు ఏర్పాట్లు చేసుకుని, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ట్రైనీ డీఎస్పీ భవ్య ఆధ్వర్యంలో అనకాపల్లి, నర్సీపట్నం సబ్ డివిజన్ల నుంచి సుమారు 70 మంది పోలీసులు, రెవెన్యూ సిబ్బంది.. ఎక్స్‌కవేటర్లతో వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు చేపట్టారు. దీంతో పలువురు ఆక్రమణదారులు యంత్రాలకు అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. పోలీస్ సిబ్బంది వారిని పక్కకు లాగేసి ఇళ్లను కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఆర్ఐ మూర్తి, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

» సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


శిక్షణ పూర్తి చేసుకున్న యువతతో సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 1: సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. సింహాద్రి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)లో నిర్వాసిత గ్రామాల యువతకు మెషిన్ ఆపరేటర్-ఇంజక్షన్ మౌల్డింగ్ అండ్ ప్లాస్టిక్ ప్రొసెసింగ్‌పై ఆరు నెలల పాటు 30 మందికి ఇవ్వనున్న శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. గత బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువపత్రాలతోపాటు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి అధికారులు బీబీ పాత్ర, కె.ప్రకాశరావు, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

'సబ్బవరం'లో బర్డ్ లఖ్‌నవూ బృందం పర్యటన


జాగృతి సొసైటీ ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కేంద్రం వద్ద సిబ్బందితో బర్డ్ లఖ్‌నవూ బృందం సభ్యులు

సబ్బవరం, ఫిబ్రవరి 1: మండలంలో గురువారం బర్డ్ (బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) లఖ్‌నవూ బృందం సభ్యులు పర్యటించారు. ముందుగా జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని సందర్శించి దాని పని తీరును అడిగి తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తి కేంద్రాలకు నాబార్డు ఎంతో సహకరిస్తుందని జాగృతి ఎండీ కందర్ప సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, సీఈవో గొంప రమణ, నాబార్డు డీజీఎం సంజయ్‌రామన్, వైజాగ్ డీసీసీబీ డీజీఎం ఎం.అశోక్‌కుమార్, జాగృతి సీఈవో మౌక్తిక, రైతులు పాల్గొన్నారు.

దుర్గమాంబ పీఏసీఎస్ సేవలు భేష్

సబ్బవరం దుర్గమాంబ పీఏసీఎస్ రైతులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని బర్డ్ లఖ్‌నవూ ప్రోగ్రాం డైరెక్టర్ ప్రశాంత్ దూబే పేర్కొన్నారు. 30 మంది సభ్యులతో కలిసి ఆయన పీఏసీఎస్‌ను సందర్శించి దాని ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ అభివృద్ధిని బృందం సభ్యులకు సీఈవో గొంప రమణ వివరించారు.

వంటా వార్పుతో న్యాయవాదుల నిరసన


కోర్టు ముందు వంట చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: భూ హక్కుల చట్టం రద్దును కోరుతూ రిలే నిరాహారదీక్ష చేస్తున్న న్యాయవాదులు గురువారం ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సూర శ్రీనివాసరావు, కుమార్, రాపేటి బాలగంగాధర్‌తిలక్, రమణయ్య, అడపా సుధాకర్, కొయిలాడ గంగాధరరావు, వెంకటరెడ్డినాయుడు, నూకరాజు, దుర్గాభవాని, అనిత, ప్రసన్న పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు సమ్మె విరమణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: గత కొద్ది రోజులుగా సమ్మె బాట పట్టిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు తమ సమ్మెను విరమించినట్టు తెలిపారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ఏపీడీ డైజీకి సమ్మె విరమణ లేఖను గురువారం అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడంతో సమ్మె విరమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు డి.నానిబాబు, ఎస్.శ్రీనివాస్, ప్రకాశ్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో డైట్ కళాశాల ఎంవోయూ


రవిశంకర్ నుంచి ఒప్పంద పత్రాలు అందుకుంటున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పండిట్ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో డైట్ కళాశాల ఇటీవల ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం రవిశంకర్ చేతుల మీదుగా జరగడం తమ అదృష్టంగా భావిస్తున్నామని కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించుకోవడానికి వివిధ కార్యక్రమాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అసోసియేట్ డీన్ (అకడమిక్) కృష్ణనాగు, ప్లేస్‌మెంట్ అధికారి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి కాంగ్రెస్ నాయకులు పయనం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో శుక్రవారం ఢిల్లీలో జరిగే ధర్నాకు అనకాపల్లి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు బయలుదేరారు. వీరిలో అనకాపల్లి నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోశ్, ఎలమంచిలి నియోజకవర్గం నుంచి తనకాల అనంతరావు, పెందుర్తి నియోజకవర్గం నుంచి ఆడారి రమేశ్, పాయకరావుపేట నుంచి శంకర్, యువజన కాంగ్రెస్ నాయకుడు షేక్ షఫీ తదితరులు వున్నారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్: లోకనాథం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్‌లో లేవన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గాని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితుల విషయం గాని ప్రస్తావన లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి తదితర ఏ అంశాలు ఈ బడ్జెట్‌లో లేకపోవడమంటే ఆంధ్రా ప్రజలను వంచించడమే అవుతుందన్నారు.

93 గ్రామాల్లో బెల్లం తయారీ అంచనా ప్రయోగాలు

మునగపాక, ఫిబ్రవరి 1: దేశంలో ఎగుమతి, దిగుమతుల అవసరాల నిమిత్తం బెల్లం తయారీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంచనా కోసం చెరకు బెల్లం తయారీ అంచనా ప్రయోగాలు చేపట్టినట్టు ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ జి.రామారావు తెలిపారు. మండలంలోని అరబుపాలెం గ్రామంలో గురువారం బొడ్డేడ రామచంద్రరావు రైతు పొలంలో బెల్లం తయారీపై అంచనా ప్రయోగాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 93 గ్రామాలను ఎంపిక చేసి ఒక్కో గ్రామంలో రెండు ప్రయోగాలు చొప్పున పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ ప్రయోగాల వల్ల దిగుబడి అంచనాలు తెలుస్తుందని, దీని వల్ల దేశవ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులలో ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వర్మ, ఉప గణాంక అధికారులు భవాని, శశికళ, వైకుంఠరావు, చంద్రమౌళి, వ్యవసాయ సహాయకులు వానపల్లి సత్య రవిరాజ్, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సమరమే..

... 5వ పేజీ తరువాయి

భారత్ బ్యాటింగ్ ఆధారపడి ఉంది. స్పిన్నర్లే ప్రధాన అస్త్రాలుగా ఇరు జట్లు బరిలోకి దిగే అవకాశాలున్నాయి. తొలి టెస్టులో ఇంగ్లండ్ స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ బౌలింగ్‌లో భారత్ బ్యాట్స్‌మెన్లు తడబడ్డారు. హార్ట్‌లీకి బషీర్ తోడు కావచ్చు. ఇక భారత్ స్పిన్నర్ అశ్విన్‌కు ఇక్కడి పిచ్‌పై మంచి రికార్డు ఉంది. జడేజా స్థానంలో సిరాజ్ ఆడే అవకాశాలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ కీలకంగా మారనున్నది. రెండో రోజు నుంచి పిచ్ స్వభావం మారే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు.

నిరుద్యోగులకు జగన్ నయవంచన

▸ పాదయాత్రలో ఏటా జాబ్ క్యాలెండర్ అని కల్లబొల్లి కబుర్లు ▸ ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ యువతను మోసగించడమే..

▸ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలు ▸ ఆంధ్రాకు మంచిరోజులు చంద్రబాబుతోనే ▸ టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర

అరకులోయ, ఫిబ్రవరి 1 : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిట్టనిలువునా ముంచేశారని, నయవంచనకు పాల్పడ్డారని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. గురువారం అరకులోయలోని తన స్వగృహంలో పార్టీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా ఇప్పుడు కేవలం 6100 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామనడం నిరుద్యోగ యువతను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్, డీఎస్సీ తీస్తామని చెప్పి జగన్ మాట తప్పారన్నారు. నాడు- నేడు పేరుతో పాతభవనాలకు రంగులు వేసి డబ్బులను నొక్కేశారని ఆరోపించారు. జగన్‌రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా నిరుద్యోగ యువత నమ్మే స్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని, మళ్లీ ఆంధ్రాకు మంచిరోజులు రావాలంటే టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. డుంబ్రిగుడ మాజీ ఎంపీపీ దన్నేరావు, మాజీ ఎంపీటీసీ జగన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర దీక్షను విజయవంతం చేయండి

▸ పోస్టర్ ఆవిష్కరణలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శశికుమార్


దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

చింతపల్లి, ఫిబ్రవరి 1 : ఓపీఎస్ సాధనకు విశాఖపట్నంలో ఈనెల నాలుగో తేదీన తలపెట్టిన సాగర దీక్షను ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరి శశికుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ పింఛన్ విధానం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ జీపీఎస్ వల్ల ఉద్యోగులు పదవీ విరమణ రాయితీలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే పాత పింఛన్ విధానం అమలులోకి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి బొడు గంగరాజు, మండల అధ్యక్షుడు కాకరి చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కిముడు మహేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, పాత్రుడు, రమేశ్ నాయుడు పాల్గొన్నారు.

'స్పర్శలేని మచ్చలపై అప్రమత్తంగా ఉండాలి'


డుంబ్రిగుడ పాఠశాలలో స్పర్శ ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 1 : స్పర్శలేని మచ్చలపై అప్రమత్తంగా ఉండాలని డుంబ్రిగుడ ప్రాథమిక వైద్యాధికారిణి అంబికా రమణి అన్నారు. ఇక్కడి కేజీబీవీ, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో కుష్ఠు వ్యాధి నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్పర్శ ఆకారంలో ఏర్పడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్ఈవో శౌరి, వైద్య సిబ్బంది, పాఠశాలల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో పోలీసులు వాహన తనిఖీలు

▸ ఛత్తీస్‌ఘఢ్ ప్రాంతంలో మావోయిస్టుల అలజడి నేపథ్యంలో అప్రమత్తం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 1 : మండల కేంద్రం ముంచంగిపుట్టులో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీలు వాహన తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన నేపథ్యంలో ఆంధ్ర, ఒడిశా పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు జోలాపుట్టు, పెదబయలు, రూఢకోట, సంగడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసులు వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. అలాగే ఇరు రాష్ట్రాల పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడపడుతున్నట్టు తెలుస్తుంది.

డోలీ మోతలు ఇంకెన్నాళ్లు?

... 5వ పేజీ తరువాయి

తీరడం లేదనే వాదన బలంగా ఉంది. నిధుల లేమి కారణంగా వున్న రోడ్లకే మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో ఇక గిరిజన ప్రాంతాల్లోని మారుమూల పల్లెలకు రోడ్ల నిర్మాణం కలగా మిగిలిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు రప్పించి, ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలనే ఆలోచన చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, రవాణా సదుపాయాలు కల్పిస్తేనే గిరిజనులకు అభివృద్ధి ఫలాలు చేరువవుతాయనే సత్యాన్ని పాలకులు గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

మన్యంలో డోలీ మోతలు, మృత్యువాతల ఘటనలు కొన్ని..

- పాడేరు మండలం బడిమెల పంచాయతీ పరిధి వల్లాయి గ్రామంలో గతంలో పిడుగు పాటుకు గాయపడిన మాదెల పెద్దమ్మను రెండు కిలోమీటర్లు డోలీలో మోసుకువచ్చి అక్కడి నుంచి వేరే వాహనంలో ఆస్పత్రి తరలించారు.
- హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ కామయ్యపేట గ్రామానికి చెందిన గర్భిణి గొల్లోరి పుష్ప(29)కు రక్తహీనత అధికమై సకాలంలో వైద్యం అందక గతంలో మృతి చెందింది.
- చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పాలమామిడి గ్రామానికి చెందిన సిందేరి దేవి గర్భిణి, పురిటి నొప్పులు రావడంతో గ్రామానికి దూరంగా ఉన్న తాజంగి పీహెచ్‌సీకి డోలీలో తీసుకుని వెళుతున్న క్రమంలో అడవిలోనే ప్రసవించింది.
- కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ కుంబుర్ల గ్రామానికి చెందిన గర్భిణి కొర్రా రోజా(22)కి ఇటీవల పురిటి నొప్పులు రావడంతో గ్రామం నుంచి డోలీలో డౌనూరు పీహెచ్‌సీకి మోసుకువస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది.
- పెదబయలు మండలం గోమంగి పంచాయతీ బోడ్డాపుట్టు గ్రామానికి చెందిన గర్భిణి అమిడేలు విజయకు ఇటీవల పురిటి నొప్పులు రావడంతో రెండు కిలోమీటర్లు డోలీలో మోసుకువచ్చి అక్కడి నుంచి 108లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గ్రామ వలంటీర్ హత్య?

▸ రక్తపు మడుగులో మృతదేహం ▸ ముఖంపై బలమైన గాయాలు

▸ మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం పొలాల్లో ఘటన


నడింపల్లి హరినాథ్ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 1: మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీరు ఒకరు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. ముఖంపై బలమైన గాయాలు వుండడం, మృతదేహం వద్ద రక్తం మడుగు వుండడంతో స్థానికులు హత్యగా భావిస్తున్నారు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి హరినాథ్ (25) గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి బుధవారం సాయంత్రం పంచాయతీ సిబ్బంది నుంచి లక్షా పది వేల రూపాయలు తీసుకుని ఇంటికి వచ్చాడు. డబ్బులను పెట్టెలో పెట్టి, జాగ్రత్తగా చూడాలని తల్లి ఈశ్వరమ్మకు చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఒక యువకుడు వచ్చి హరినాథ్ ఉన్నాడా? అని ఆమెను అడిగాడు. ఇప్పుడే బయటకు వెళ్లాడని ఆమె చెప్పింది. కాగా రాత్రి ఎంతసేపు అయినాసరే హరినాథ్ ఇంటికి రాలేదు. గురువారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో స్నేహితుల వద్ద వుండి వుంటాడని ఈశ్వరమ్మ భావించింది. కాగా ఉదయం పది గంటలైన హరినాథ్ పింఛన్ డబ్బులు పంపిణీ చేయకపోవడంతో పంచాయతీ అధికారులతోపాటు వైసీపీ నాయకులు ఆరా తీశారు. అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్చాఫ్ అని వస్తున్నది. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తరువాత పంట పొలాల్లో హరినాథ్ మృతిచెంది వుండడాన్ని గుర్తించిన ఒక రైతు గ్రామంలోకి వచ్చి విషయం చెప్పాడు. పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామ పెద్దలు.. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హరినాథ్ రక్తపు మడుగులో పడి వున్నాడు. ఎస్ఐ రామకృష్ణారావు వచ్చి పరిశీలించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా, సీఐలు హరి, గణేశ్ వచ్చి వివరాలు సేకరించారు. హరినాథ్ ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో గ్రామస్థులు, పోలీసులు హత్యగా అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

అప్రెంటిస్‌షిప్ విధానం అమలు తగదు

▸ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్మోహన్‌రావు, ధనరాజ్

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : ఉపాధ్యాయ సంఘాల ఉద్యమాల ఫలితంగా రద్దు కాబడిన అప్రెంటిస్‌షిప్ విధానం మళ్లీ అమలు చేయాలనే నిర్ణయాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఫెడరే షన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.జగన్మోహన్‌రావు, ధనరాజ్ అన్నారు. గురువారం ఇక్కడ వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలపై పోరాటాలు చేసి రెండు సంవత్సరాల అప్రెంటిస్‌షిప్‌ను రద్దు చేయించుకున్నామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలు చేస్తుంటే.. ఇప్పటికే రద్దు కాబడిన అప్రెంటిషిప్ విధానం మళ్లీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకోవడం దారుణమన్నారు. డీఎస్సీ అంటూ ఊరించిన వైసీపీ ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నివేదికను ఇచ్చి, 6,100 పోస్టులకు పరిమితం చేయడం తగదన్నారు.

'అది మెగా కాదు.. దగా డీఎస్సీ'

'వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ' అని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స విమర్శించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా డీఎస్సీ కోసం సుమారు ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే కాలయాపన చేసిన జగన్ ప్రభుత్వం, మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయన్న ఉద్దేశ్యంతోనే తూ.తూ. మంత్రంగా 6,100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తుండడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. వీటన్నింటినీ నిరుద్యోగ యువత గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.సుందరరావు పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వంలో గిరిజన చట్టాలు నిర్వీర్యం'


సొలభంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న సుబ్బారావు

జి.మాడుగుల, ఫిబ్రవరి 1: వైసీపీ పాలనలో గిరిజనులకు ఒరిగిందేమీ లేదని ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని సొలభం, పెదలోచలి, గడుతూరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం గిరిజనుల చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధితో పాటు గిరిజనుల భవిష్యత్తు బాగుంటుందన్నారు. ప్రజలంతా టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిందిగా కోరారు. అనంతరం సొలభంలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి రూ. 20వేల నగదు విరాళంగా అందజేయడంతో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మత్స్యరాజు, నాగబ్బాయి, కొండం నాయుడు, భీమశంకర్, వినోద్, కొండబాబు, కిరణ్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

'విజయమే లక్ష్యంగా పనిచేస్తాం'


పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న మత్స్యలింగం

అరకులోయ, ఫిబ్రవరి 1 : వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పార్టీ శ్రేణుల సహాయ సహకారాలతో రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అంతా ఐక్యంగా ముందుకు సాగుతామని వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేగం మత్స్యలింగం తెలిపారు. గురువారం సాయంత్రం అరకులోయలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తాను టీచర్ వృత్తిని వదులుకొని రాజకీయాల్లో వచ్చానన్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్ ఆశించినా దక్కలేదని, ఈ ఏడాది తనను జగన్ గుర్తించారన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై రాష్ట్ర ప్రజలంతా విసుగు

▸ రానున్న ఎన్నికల్లో పాడేరు, అరకు అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలి

▸ బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు


వర్చువల్ సమావేశంలో బీజేపీ నాయకులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : రానున్న ఎన్నికల్లో పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాలతో పాటు అరకు పార్లమెంటు స్థానానికి పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే అందరి లక్ష్యం కావాలని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పాడేరులో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పాడేరు అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ దుక్కేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో మాట్లాడారు. పొత్తులతో సంబంధం లేకుండా బీజేపీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్ర ప్రజలంతా విసిగిపోయారన్నారు. కేంద్ర అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై రానున్న ఎన్నికల్లో ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. అనంతరం జరిగిన మండలస్థాయి సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కురుసా పార్వత్మ, ఎం.శాంతకుమారి మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీ నుంచి పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. నాయకులు సల్లా రామకృష్ణ, కె.కృష్ణారావు, ఎస్.శివకృష్ణ, టి.సత్యవతి, పాపిటిరాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రో పవర్ ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు'


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 1 : యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు తగవని వైసీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తాను హైడ్రో పవర్ ప్రాజెక్టుకు బినామీగా పనిచేస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఈ విషయంలో ఆధారాలు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ కోరాబు అనుషాదేవి, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైసీపీ నాయకుడు జల్లి సుధాకర్, ఎంపీటీసీ ధారలక్ష్మి పద్మ, జయలక్ష్మి, సర్పంచ్ పండయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై దృష్టి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న భవన నిర్మాణ, కార్పెంటర్, పుట్టీ, పెయింటింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొట్టగుళ్లి రామారావు అన్నారు. ఇక్కడి ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. సభ్యుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ హనీఫ్, సందడి దామోదరం, మఠం స్వామినాయుడు, కొమ్మోజు వెంకటరమణ, శ్రీశైలం నానాజీ, సురేష్, రాంబాబు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బూదరాళ్ల జట్టు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టు సభ్యులు

కొయ్యూరు, ఫిబ్రవరి 1 : ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని బూదరాళ్లకు చెందిన జట్టు క్రీడాకారులు జిల్లా స్థాయిలో అద్భుత ఆటతీరును ప్రదర్శించారు. దీంతో వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. విశాఖ వేదికగా ఈ నెల పదో తేదీన జరగనున్న పోటీల్లో తలపడనున్నారు. వీరిని పంచాయతీ ఉప సర్పంచ్ సంజీవ్ తదితరులు అభినందించారు.

'ప్రేరణ'ను సద్వినియోగం చేసుకోండి : సీఐ


మినుములూరులో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ కోరారు. గురువారం ఆయన మినుములూరును సందర్శించి గ్రామ పెద్దలు, యువతతో సమావేశమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు అంతా పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు. ఎస్ఐ జి.రంజిత్‌కుమార్, సర్పంచ్ లంకెల చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించాలి'

పెదబయలు, ఫిబ్రవరి 1 : పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలనను విధిగా పాటించాలని స్టేట్ లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ ఆదేశించారు. పెదయబలులోని పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వార్డుల్లో పర్యటించారు. పలువురు రోగులను కలిసి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు నిఖిల్, వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జి.మాడుగుల మండల అధ్యక్షుడిగా నూకరాజు

జి.మాడుగుల, ఫిబ్రవరి 1 : బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బొయిని నూకరాజు, సాగిన చిరంజీవి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం ఇక్కడ జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు మాట్లాడుతూ వీరితో పాటు పొట్టిబాబు, ఆర్.మత్స్యలింగం కన్వీనర్లుగా ఎన్నికైనట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చ అధ్యక్షుడు కురుసా ఉమమహేశ్వరరావు, గిరిజన మోర్చ రాష్ట్ర మేధావుల కన్వీనర్ కురుసా పార్వతమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మఠం శాంతకుమారి, నాయకులు రామకృష్ణ, మత్స్యకొండబాబు, నందోలి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూ రీ సర్వే : సబ్‌కలెక్టర్


గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న ధాత్రి

పెదబయలు, ఫిబ్రవరి 1 : భూముల రీ సర్వే పక్కాగా సాగాలని పాడేరు నూతన సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని బొండపల్లి పంచాయతీ చంపపుట్టులో గురువారం నిర్వహిస్తున్న భూ సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి పెదబయలులో ఉన్న జీసీసీ గోదాంలోని స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. నాణ్యమైన సరకులను సకాలంలో సరఫరా చేయాలన్నారు.

తహసీల్దార్ వేణుగోపాల్‌కు వీడ్కోలు

అరకులోయ, ఫిబ్రవరి 1 : ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్‌కు మన్యం జిల్లాకు బదిలీ అయ్యింది. కార్యాలయ సిబ్బంది గురువారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ తహసీల్దార్ కె.మత్స్యలింగం, ఎలక్షన్ డీటీ, సీనియర్ అసిస్టెంట్, వీఆర్‌వోలు, సర్వే సిబ్బంది దుశ్శాలువలతో సత్కరించారు.

'వైసీపీ నిరంకుశ పాలనకు త్వరలో స్వస్తి'

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 1 : రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీకి ప్రజలు స్వస్తిచెప్పే రోజులు ఆసన్నమయ్యాయని జనసేన పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరంజీవి అన్నారు. మండలంలోని కొర్రా గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు సీదరి దన్నేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు. నాయకులు రామకృష్ణ, పడాల్, మల్లికార్జునరావు, ప్రసాద్, రమేష్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో స్పందన : కలెక్టర్

పాడేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీ ప్రాంత ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాలన్నారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

వీఆర్‌వోల డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : గ్రామ రెవెన్యూ అధికారుల డైరీని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం జిల్లా నాయకులు మర్రిచెట్టు రామునాయుడు, సీహెచ్.రమేష్‌కుమార్, జె.వెంకటలక్ష్మి, కొంటా కోటిబాబు, జి.రమేష్‌బాబు, ఎస్.అబ్బాయిదొర, కె.సత్యారావు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న కొత్త జేసీ


పూజలు చేస్తున్న భావన వశిష్ట

పాడేరు రూరల్, ఫిబ్రవరి 1 : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మను జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట గురువారం దర్శించుకున్నారు. జేసీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆమె అమ్మవారి ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు తదితరులు ఆమెను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

సెర్ప్ ఉద్యోగులు సెమ్మె విరమణ

పాడేరు, ఫిబ్రవవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెగ్యులర్ చేస్తూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌పై గత మూడు రోజులుగా సమ్మె చేపట్టిన సెర్ప్ ఉద్యోగులు గురువారం తమ ఆందోళనను విరమించారు. ప్రభుత్వంతో సంఘం నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమించినట్టు సదరు ఉద్యోగులు విలేకరులకు తెలిపారు.

ఎన్నికల్లో అరకు నుంచి పోటీ : అబ్రహం

హుకుంపేట, ఫిబ్రవరి 1 : రానున్న ఎన్నికల్లో అరకు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం తెలిపారు. మండలంలోని తీగలవలస పంచాయతీ బిజ్జపల్లిలో గురువారం పర్యటించి అక్కడి వారితో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలంతా తనను గెలిపించి ఆశీర్వదించాల్సిందిగా కోరారు. నాయకులు కామేశ్వరరావు, అప్పాలస్వామి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన ఆవాసాలకు విద్యుత్ సౌకర్యం'

కొయ్యూరు, ఫిబ్రవరి 1 : పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో విద్యుత్ సదుపాయానికి నోచుకోని గిరిజన ఆవాసాలకు పర్టిక్యులర్లీ వలనేరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీటీజీ), రివాంప్‌టెడ్ డిస్ట్రిబ్యూషన్ సక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద ప్రతి ఇంటిని విద్యుదీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ (ఆపరేషన్స్) మహేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గత ఏడాది అనంతగిరి వేదికగా జరిగిన ఫోరమ్ ఆఫ్ రెగ్యులేటర్స్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో చొరవ తీసుకుని ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జునరెడ్డిని కలిసి ఐటీడీఏ పరిధిలో నేటికీ విద్యుత్ సదుపాయానికి నోచుకోని గిరిజన ఆవాసాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరిన నేపథ్యంలో ఈ రకమైన చర్యలు చేపట్టినట్టు వివరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై ఎస్‌బీఐ కళాజాత


పాడేరు బ్రాంచ్‌లో కళాజాత ప్రదర్శన దృశ్యం

పాడేరు, ఫిబ్రవవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్థానిక బ్రాంచ్ పరిధిలోని పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట ప్రాంతాల్లో గేయ, నృత్య రూపాల్లో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, పలు సంక్షేమ, బీమా పథకాలపై అవగహన కల్పిస్తున్నారు. పాడేరు బ్రాంచ్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన లేకపోవడం వల్లే ప్రజలు సైబర్, ఆర్థిక నేరాలకు గురికావడంతో పాటు పొదుపు, రాబడి వంటి అంశాలకు దూరంగా ఉంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవోగా వీర సాయిబాబు



చింతపల్లి, ఫిబ్రవరి 1 : ఇక్కడి ఎంపీడీవోగా వి.వీరసాయిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం నుంచి ఈయన ఇక్కడికి విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ఎంపీడీవో పి.ఆశాజ్యోతిని తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా కొత్త ఎంపీడీవోకు సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

తహసీల్దార్ ప్రసాద్‌కు ఘనంగా వీడ్కోలు



గూడెంకొత్త వీధి, ఫిబ్రవరి 1 : ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్‌వీ ప్రసాద్ బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ కుమార స్వామి, ఆర్ఐ మహదేవ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.